అదయ్యాక "అసలు మీ కిద్దరికీ పెళ్లెందుకు కాలేదు?" అన్నాడు.

"చెప్పేను కాదండీ. నాకేమో నెలకీ తులం బంగారం విలువైన జీతం గానీ; లేకపోతే రెండేళ్ల గ్రాసం విలువైన బాంకెకౌంటుగానీ ఉండాలంటుందండి మా పద్మ. "

"ఇప్పుడు నీ జీతం ఎంత?"

"2800 సార్. లోకల్ ట్రిప్పులకి పెట్రోలు కర్చులకింద కంపెనీ 500 ఇస్తే దాంట్లో 300 మిగుల్తాయండి. అయినాసరే తులంబంగారం జీతం లేదండి."

"ఏయ్ పిల్లా, ఇట్రా! ఈ కేసు రాయడం లేదుగానీ మీరిద్దరూ వోదెగ్గిర ఓ గంటపాటు స్తిమితంగా కూకుని లెక్కలేసుకుని; ఇంకా లేటైపోకముందే పెళ్లి జేస్కోండి. ఆ తరవాతుందే; మీరు వొకర్నోకరు డేష్ కొట్టుకోవాలనిపిత్తే ఆ బళ్లు ఇంటి కాడొగ్గీసి-"

అంతే. ఆ తరవాత పోలీసాయనకి నవ్వుతో పొలమారి మాట రాలేదు.

★

# 87. ఉద్యోగ యోగము

**"కం**గ్రాచులేషన్స్ మామయ్యా" అన్నాడు, నన్ను చూస్తూనే, మా మేనల్లుడు చలపతి. "దేనికి రోయ్?" అన్నాను. "నీక్కాదు, నాకు!" అన్నాడు. "నీకేదైనా మంచి జరిగితే నేను కదా కంగ్రాచులేషన్స్ అని చెప్పాలి! నువ్వే నీకు కంగ్రాచులేషన్స్ చెప్పుకుంటున్నావా?" అని మందలించబోయి మా బావగారి సంగతి గుర్తొచ్చి ఆగేను. మా బావగారు అప్పుడెప్పుడో చదువుకుంటూ వుండేటప్పుడు పద్యాలు రాసేవారు. ఆయన కాలేజిలో చదివిన నాలుగేళ్లూ ఆయన రాసిన పద్యాలు కాలేజీ మేగజైన్‌లో అచ్చువెయ్యడం అదంతా మా అక్కకీ ఆయనకీ పెళ్లి మాటలవుతున్న రోజుల్లో మేం తెలుసుకున్నాం. చిత్రం ఏమిటంటే చివరి రెండేళ్ల మేగజైన్స్‌లోనూ ఆయన పేరుకి ముందర "మధుర కవి" అని వుంది. " మీపూర్వులు కొన్నాళ్లు మధురలో ఉండేవారా?" అని నేను అడిగేను. "అబ్బే లేదు; మధురకవి అంటే తియ్యటి కవిత్వం రాసే కవి అన్నమాట. అది ఒక బిరుదు" అన్నారాయన. "ఎవరిచ్చేరు మీకు ఆ బిరుదు?" అని నేను అడక్కుండానే ఆయన అటూ యిటూ దొంగచూపులు చూసి "ఎవరైనా నాకు బిరుదు లివ్వడం , సన్మానాలు చెయ్యడం నాకు ఇష్టం వుండదు. అంచేత నేనే-"

మా మేనల్లుడు చలపతి అంటే మా(అ) బావగారి కొడుకే కదా. అంచేత వాడికి ఏదో 'మంచి' జరిగిందన్న సంగతి విన్నా నేను అభినందిస్తానో లేదో అని తనే స్వయంగా కంగ్రాచు లేషన్స్ చెప్పుకున్నాడన్నమాట.

ఇంతకీ చలపతి తనని తాను అభినందించుకోడం ఎందుకుటా అంటే; వాడు "నిన్న" మధ్యాన్నం మూడుగంటలకి (పార్వతీపురం నుంచి) విశాఖపట్నం వచ్చేడట. నాకోసం మా ఇంటికి వెళ్తే "ఇప్పుడే బయల్దేరి వెళ్లేరు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాదు వెళ్తున్నారు" అని

మా ఇంట్లో వాళ్లు చెప్పేరు. ఆఘమేఘాల మీద రైల్వేస్టేషన్ కొచ్చేసరికి బండి " బయల్దేరుటకు సిద్ధముగా'' ఉన్నదట. టికెట్ కొనుక్కుని జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కి హైదరాబాదు ప్రయాణం చేసేడట - నేను సికింద్రాబాదులో దిగిపోయి - మాగెస్టుహౌస్‌కి వచ్చుంటానని నాంపల్లి స్టేషన్ వచ్చేక గాని తట్టకపోయినా; గెస్ట్‌హౌస్ కొచ్చేసరికి నేను దొరికేనట. అందుకు; అతన్ని అతను అభినందించుకోడం.

"నీకు పరమహంస గారు బాగా తెలుసుకదా. నాకు ఉద్యోగం ఇప్పించుతావని. ఎల్లుండి ఇంటర్ వ్యూ వుంది. ఇవాళా రేపూ నేనెక్కడైనా కాలక్షేపం చేసేస్తాను. ఎల్లుండి నువ్వు నాతో టీవీ స్టేషన్ కొచ్చి నా ఇంటర్ వ్యూ ప్రారంభం అయ్యే ముందో తరవాతో ఆయనతో చెప్తావని. అసలు నిన్న నేను వైజాగ్ వచ్చింది నిన్ను వెంటబెట్టుకుని ఇక్కడి కొద్దామనే''.

టీవీలో వార్తలు చదవడానికీ ఎనౌన్సుమెంట్లు చెయ్యడానికీ తాత్కాలిక ప్రాతిపదిక మీద యువతీ యువకుల్ని తీసుకుంటున్నారట. ముఖ వర్చస్సు, జుట్టు పరిమాణం, తన స్వంతానికి ఉన్న రంగుల (గళ్ల) చొక్కాల సంఖ్య, అనువాద సామర్థ్యం , కంఠ స్వర వైఖరి అన్నీ "కింది లెవెల్'' అధికారులు జరిపిన పరీక్షల్లో సరిచూసుకున్నారుట. ఇప్పుడు ఫైనల్ ఇంటర్ వ్యూ, పరమహంస గారు చేస్తారట.

"సరే, చెప్తాను గానీ ముందు నేను నిన్ను పరీక్ష చేస్తాను. ఇప్పుడు కాదు, ఇవాళా రేపూ రెండురోజులపాటు నువ్వు ఇక్కడే వుండి కొన్ని వార్తలు రాయాలి. కొన్ని ఎనౌన్సుమెంట్లు ప్రాక్టీస్ చెయ్యాలి.''

అన్నిటికీ సిద్ధమే అన్నాడు.

★★★

మా మేనల్లుడు చలపతి నేను పెట్టిన పరీక్షలకి సమాధానాలు ఇచ్చిన వివరాలు నేను ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటూ ఆ కాగితాలు పరమహంస గారికి చూపించాలని నా ప్లాను.

"ముఖ్యమంత్రి గారు ఆ భవనం ముఖద్వారం వద్ద నిలబడి ప్రసంగించారు'' అని చలపతి.

"ముఖద్వారం అంటే నీ ఉద్దేశం ప్రవేశ ద్వారం అనేకదా?'' అన్నాను.

"సరిగ్గా అదే.''

"దాన్ని సింహద్వారం అంటారు. సింహం అంటేనీకు భయం కనక ప్రవేశ ద్వారం అని రాయొచ్చు కదా?''

"మరి ప్రవేశద్వారం అనేటప్పుడు మాయాబజారు ప్రభావం వల్ల పరవేశ దవారం అనేస్తానేమో అనే భయంచేత అలా రాసుకున్నాను.''

"ముఖద్వారం అనే మాట నదులు సముద్రంలో కలిసే చోటు కోసం వాడుతారు. అది ప్రవేశ ద్వారం అవదు; నిర్గమన ద్వారం అవుతుంది'' అని చెప్పేను.

"కరసేవ సందర్భంగా వివాదాస్పద కట్టడం కూలదోసినప్పుడు ఆరుగురు వ్యక్తులు సజీవంగా మరణించేరు. '' అన్నాడు చలపతి.

"సజీవంగా సమాధి అయ్యేరనా, నీ ఉద్దేశం?'' అని అడిగాను.

ఔనని ఒప్పేసుకుని నాలుక కరుచుకున్నాడు.

"క్రిస్‌మస్ సందర్భంగా మంత్రిగారు రోగులకి శుభాకాంక్షలు చెప్పడానికి ఆస్పత్రికి వెళ్లి రోగులకు పండులు పంచిపెట్టారు" ఇది ఇంకొక వార్త.

"పండులు, ఏమిటి? పళ్లు అనొచ్చు కదా?" అన్నాను.

"ఆస్పత్రి కదా! పళ్లు అంటే దంతాలు అనే అర్థం వస్తుందని అలా అన్నాను."

"పోనీ -ఫలాలు - అనొచ్చుకదా?"

"తులాలూ ఫలాలూ పోయి కేజీలూ గ్రాములూ ఎప్పుడో వచ్చేశాయి మామయ్యా."

"మొహరం పండగకి ఈ ఏడాది శుక్రవారం కూడా కలిసి వచ్చినందున మహమ్మదీయులు అధిక సంఖ్యలో సమాజ్‌లో పాల్గొన్నారు." ఇది ఇంకొక వార్త.

చలపతి రాసుకున్న కాగితం చూశాను. "నమాజ్" అనే మాట రాసుకున్నప్పుడు పెన్ కొంచెం ఇబ్బంది పెట్టినట్టుంది. నమాజ్ అని రాసినట్టు కనిపించింది.

"రేపు సాయంకాలం ఐదున్నరకి అప్పలస్వామి గారిచే వీణా వాదన." ఇదొక ఎనౌన్సుమెంటు.

"వాదన ఏమిటి?" అని అడిగేను.

"అది అంతే. హిందీలో సితార్ వాదన్, వయొలిన్ వాదన్ అని చెప్తారు కదా. తెలుగులో వీణా వాదన, మృదంగ వాదన అని చెప్పాలి." ఈ సారి గొప్ప ఆత్మవిశ్వాసంతో చెప్పాడు చలపతి.

"కాని, తెలుగులో వాదన అంటే డిస్కషన్ అనీ, ఆర్గుమెంట్ అనీ అర్థం. వాదప్రతివాదాలు; అంటే మాటకి మాట వచ్చే సంభాషణనే "వాదన" అనాలి. సంగీత కచేరీ చేసేటప్పుడు ఉపయోగించే వాయిద్యాలు - వీణ, వయొలిన్ ఇలాటి వాటితో చేసే కచేరీలని "వాదనలు" అనకూడదు. వాద్య సంగీతం - అనాలి. అన్ని అక్షరాలు పలకడానికి వోపిక లేకపోతే వాదనము అనొచ్చు. అంతేగాని వీణా వాదన, వయొలిన్ వాదన, మృదంగ వాదన- ఈ ప్రయోగాలు తప్పు" అని చలపతి మళ్లీ వాదన పెడతాడేమోనని భయపడుతున్నా స్పష్టంగా వివరించేను. వాడి వరస చూస్తే వేణువాదన అనికూడా ఎనౌన్సు చేసేటట్టున్నాడు.

"లేదు మామయ్యా. ఇవన్నీ మన టీవీలో వార్తలు చదివే వాళ్లూ ఎనౌన్సుమెంట్లు చేసే వాళ్లూ అంటున్న విధంగానే నేనూ అంటున్నాను." అన్నాడు చలపతి.

చలపతితో నాకెందుకు, వాదన? వాడు "మహాత్ములు పోవు త్రోవ"లో పోతున్నాడు. వాడి ముఖవర్చస్సు బావుంది. తలనిండా నల్లటి జుట్టుంది. రంగు రంగుల గళ్ల గళ్ల చొక్కాలు డజనున్నర ఉన్నాయి. ఇంతకీ పరమహంస గారు నా ఆప్తమిత్రుడు. చలపతి నాకు సాక్షాత్తు మేనల్లుడు. తెలుగు భాష , అదంతా ఏమైపోతే నాకెందుకు! అదియొక ఉద్యోగ యోగము.

★